## క్లుప్తంగా

### వరికి తెగులు



**నిజాంసాగర్:** వాతావరణ పరిస్థితుల కారణంగా వరి పంట ఉల్లికోడు తెగుళ్ల బారిన పడుతున్నాయని వ్యవసాయశాఖ అధికారులు గ్రీష్మ, మధుసూదన్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని గిర్నితాండ, తుంకిపల్లి గ్రామ పంచాయతీల్లో రైతులు సాగు చేసిన వరి పంట పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నాట్లు వేసే సమయంలో డీఏపీ కాకుండా పీఎస్‌బీ వాడాలని సూచించారు. దీనివల్ల ఖర్చు తగ్గడంతో పాటు అధిక దిగుబడి వస్తుందని వారు వెల్లడించారు.

**భిక్కనూరు:** వరి పంటలో కాండం తొలుచు పురుగు, మొగి పురుగు ఆశించే అవకాశం ఉన్నందున సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఈవో అఖిలేషు రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని రామేశ్వర్‌పల్లిలో పంట పొలాల నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం పంటల సస్యరక్షణ చర్యల గురించి అవగాహణ కల్పించారు. కాండం తొలుచు పురుగు, మొగి పురుగు నివారణకు ఎకరాకు క్లోరోపైరిపాస్ 500 ఎంఎల్ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు.

### సేవలకు సత్కారం



**రాజంపేట:** మండల ఇన్‌చార్జి ఎంపీవోగా పని చేసి బదిలీపై వెళ్తున్న ప్రవీన్ కుమార్, ఆయన స్థానంలో ఎంపీవోగా బాధ్యతలు స్వీకరించిన రఘురాంను ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండహన్మండ్లు, మండలంలోని పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు సత్కరించారు. ప్రవీన్ కుమార్ చేసిన సేవలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

### పౌష్టికాహారం పంపిణీ చేయాలి



**నిజాంసాగర్(జుక్కల్):** మండలంలోని మహమ్మద్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి తనిఖీ చేశారు. గ్రామంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టిక అహారాన్ని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సక్రమంగా పంపిణీ చేయాలని సూచించారు. ఆమె వెంట అంగన్‌వాడి టీచర్ శైలజ తదితరులు ఉన్నారు.

### పోషణ సంబరాలు

**మద్నూర్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ సంబరాలు నిర్వహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత సూచించారు. మండల కేంద్రంలోని వైఎస్ఆర్ కాలనీ అంగన్‌వాడీ సెంటర్‌లో మంగళవారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా చిన్నారుల పుట్టినరోజు వేడుక నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు కళావతి, చంపాబాయి పాల్గొన్నారు.

### ప్రారంభోత్సవానికి సిద్ధంగా వంతెన



**నిజాంసాగర్(జుక్కల్):** మండల కేంద్రంలోని మంజీరా నదిపై రూ. 25 కోట్లతో కొత్తగా నిర్మించిన పెద్ద పూల్ వంతెనను త్వరలో ప్రారంభించేందుకు ముస్తాబు చేశారు. నిజాం కాలం నాటి వంతెన వందేళ్లు దాటంతో శిథిలావస్థకు చేరుకోవడంతో వాటి పక్కనే కొత్తగా వంతెన నిర్మించారు. వంతెనకు ఇరువైపులా వెల్‌కం బోర్డులను ఏర్పాటు చేసి వాటికి రంగు లు వేయడంతో నూతన శోభ సంతరించుకుంది.

### శివాలయంలో రుద్రహోమం

**కామారెడ్డి రూరల్:** పట్టణ పరిధిలోని దేవునిపల్లి శివాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు శశికాంత్‌శర్మ, శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం రుద్రహోమం, రుద్రాభిషేక మహాయజ్ఞం నిర్వహించారు. శివభక్త కమిటీ ఆధ్వర్యంలో శివమాలాధారులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివభిక్ష కమిటీ అధ్యక్షుడు నిట్టు నారాయణరావు, ప్రతినిధులు లద్దూరి లక్ష్మీపతియాదవ్, చిన్నోళ్ల గోపాల్‌రావు, ఉరుదొండ నరేష్, నీలం వెంకటి, పాత రాజు, తస్నీరు శేఖర్, మామిండ్ల అంజయ్య, సాయాగౌడ్ పాల్గొన్నారు.

# దండిగా నిధులు.. టెండర్లు నిల్

- రోడ్ల మరమ్మతులకు ఏడాది కిందట రూ. 1.91 కోట్లు మంజూరు
- పనులు చేసేందుకు ముందుకురాని కాంట్రాక్టర్లు



కంకర తేలిన రాఘవపల్లి రోడ్డు

**నాగిరెడ్డిపేట:** పంచాయతీరాజ్ శాఖకు చెందిన రోడ్ల మరమ్మతుల కోసం ప్రభుత్వం ఏడాది కిందట మండలానికి రూ. 1.91 కోట్లు మంజూరు చేసింది. నిధులున్నా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో అధికారులు టెండర్లు పూర్తి చేయలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే పలుమార్లు టెండర్లు ఆహ్వానించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా గుంతలుపడి కంకర తేలిన రోడ్లపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి టెండర్లు పూర్తి చేసి పనులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మండలంలోని రాఘవపల్లి రోడ్డు మరమ్మతుల కోసం రూ. 39 లక్షలు, గోలిలింగాలకు రూ. 60 లక్షలు, ఏర్రారంకు రూ. 32 లక్షలు, ఆత్మకూర్ రోడ్డుకు రూ. 60 లక్షల ప్రకారం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పలుమార్లు టెండర్లు ఆహ్వానించినా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేని పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నారు.

**తిరిగి టెండర్లు పిలిచాం**

మండలంలోని రాఘవపల్లి, గోలిలింగాల, ఏర్రారం, ఆత్మకూర్ గ్రామాలకు సంబంధించి రోడ్ల మరమ్మతు పనుల కోసం ఇప్పటికే పలుమార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. తిరిగి టెండర్లు పిలిచాం. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులను ప్రారంభిస్తాం. –కృష్ణ, ఏఈ, పీఆర్, నాగిరెడ్డిపేట

# అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి

- విగ్రహం ఆవిష్కరణలో ఎమ్మెల్యే హన్మంత్ సింధే



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

**పెద్దకొడప్‌గల్:** రాజ్యాంగ నిర్మాణత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అడగుజాడలో ప్రతి ఒక్కరూ నడిచి పేరు ప్రతిష్టలు సంపాదించుకోవాలని ఎమ్మెల్యే హన్మంత్ సింధే సూచించారు. మండలంలోని కాస్లాబాద్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అంబేడ్కర్ ఆలోచనా విధానం నేటి తరానికి ఆదర్శప్రాయమని అన్నారు. బాల్యం నుండి వివక్షను ఎదుర్కొంటూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన రాజ్యాంగాన్ని రూపొందించే స్థాయికి ఎదిగిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం తన అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. న్యాయవాదిగా, ఆర్థిక శాస్త్రవేత్తగా, రాజకీయ నేతగా, సంఘసంస్కర్తగా విభిన్న పాత్రలు పోషించిన మహా నాయకుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ శోభ, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సాయిరాం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విజయ్ దేశాయ్, తిర్మల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ విజయం తథ్యం



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో సుభాష్‌రెడ్డి

**ఎల్లారెడ్డి:** వచ్చే ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ విజయం తథ్యం అని పీసీసీ కార్యదర్శి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లింగంపేట మండలంలోని లింగంపేట, కోమట్‌పల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు సుభాష్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పరంధాములు, శ్రీనివాస్ రెడ్డి, ఆఫీజ్, కాశీరాం పాల్గొన్నారు.

### ప్రణాళికలు సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

**లింగంపేట:** గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలని డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మంగళవారం ఆయన లింగంపేట రైతు వెదికలో ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. తాగునీరు, రోడ్ల నిర్మాణం, మురికి కాల్వలు, పారిశుధ్యం, విద్య, విద్యుత్, పౌష్టికాహారంతో పాటు తదితర మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గుర్తించిన పనులు స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీవోలు ప్రభాకరచారి, ప్రకాష్, శ్రీనివాస్, మజార్ పాల్గొన్నారు.

# ముగిసిన టోర్నమెంట్..



గర్గుల్‌లో టోర్నమెంట్‌కు హాజరైన క్రీడాకారులు



నాగిరెడ్డిపేటలో విజేతలకు బహుమతుల పంపిణీ

**కామారెడ్డి రూరల్:** మండలంలోని గర్గుల్ గ్రామంలో మంగళవారం హాకీ టోర్నమెంట్‌ను సర్పంచ్ చింతల రవితేజ గౌడ్ ప్రారంభించారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి మొదటి, రెండో బహుమతులను సర్పంచ్ అందజేశారు. అదేవిధంగా పది మంది బెస్ట్ ప్లేయర్స్‌కు గోల్డ్ మెడల్స్, మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ మౌనిక, మ్యాన్‌ఆఫ్‌ది సీరీస్ అజయ్‌కు అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ యేసుస్వామి, నర్సింలు, ప్రసాద్, స్వామి, నిస్సి, అఖిల్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

**క్రికెట్ టోర్నమెంట్..**

**నాగిరెడ్డిపేట:** సంక్రాంతి సంబరాలలో భాగంగా నాలుగు రోజుల పాటు నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. వివిధ గ్రామాలకు చెందిన 10 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో తాండూర్, నాగిరెడ్డిపేట గ్రామాలకు చెందిన జట్లు తలపడ్డాయి. తాండూర్ జట్టు ప్రథమ బహుమతిని, నాగిరెడ్డిపేట జట్టు ద్వితీయ బహుమతిని గెలుపొందాయి. గోపాల్‌పేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు వంజరి కిరణ్‌కుమార్ విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు దత్తు, అవినాష్, మైను, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

**దోమకొండ:** మండలంలోని జనగామ గ్రామంలో మూడు రోజులుగా జై భీం గ్రూపు సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. విజేతలకు నగదు బహుమతితో పాటు ట్రోఫీలను అందజేశారు. క్రికెట్‌లో మొదటి బహుమతి జై భీం గ్రూపు, వాలీబాల్‌లో ఆదర్శ యూత్, కబడ్డీలో బ్యాడ్ బాయ్స్ యూత్ విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ గ్రామాధ్యక్షుడు నిమ్మ వినీత్, బాగేష్, శ్రీధర్, మహేష్, జీవన్, స్వామి, మహేష్, గౌతమ్, విష్ణు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.



అంబారిపేటలో..

### ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



**కామారెడ్డి అర్బన్:** పట్టణ పరిధిలోని టేకిర్యాల శివారులో చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతున్నాయి. తన పొలంలో వేలాడుతున్న వైర్లను సరిచేయాలని పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని టేకిర్యాలకు చెందిన పి.రాము ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం సంభవించకముందే అధికారులు స్పందించాలని ఆయన కోరారు.

### ముగ్గుల పోటీలు



**తాడ్వాయి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సిములు, ఎస్సై ఆంజనేయులు, వీడీసీ చైర్మన్ మేకల రాజు తదితరులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ





**కామారెడ్డి అర్బన్:** గంగపుత్ర ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు కలెక్టర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ఎం.రాజన్న, పాక వెంకటి, కేపీ అనిల్‌కుమార్, రాము, పోచన్న, జుగల్ కిషోర్, గిర్నబోయి, బాల్‌రాజ్, ఎల్లేష్, ప్రవీణ్, నరేష్, రమేష్, గంగారాం, చందర్, అనంత్ తదితరులు పాల్గొన్నారు.

**కామారెడ్డి రూరల్:** అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా యూనిట్ క్యాలెండర్, డైరీలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఉద్యోగులు అంకిత భావంతో పని చేయాలని కలెక్టర్ వారికి సూచించారు. కార్యక్రమంలో ఏడీఏలు లక్ష్మీ ప్రసన్న, విన్సెంట్‌వినయ్ ఏవోలు శ్రీనివాస్‌రావు, అనిల్‌కుమార్, సంతోష్‌కుమార్, జోత్స్న ప్రియదర్శిని, పోచయ్య, కిషన్, కమల, రాజు, టెక్నికల్ ఏవో సునితరాణి పాల్గొన్నారు.

# రుణాల కోసం ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

**సదాశివనగర్:** మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో మైనార్టీ రుణాల కోసం మూడు యూనిట్లు మంజూరు కాగా 74 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు, వైఎస్ ఎంపీపీ గాంధారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో సురేందర్‌రెడ్డి, వివిధ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

**దోమకొండ:** మైనార్టీ కార్పోరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ శాంత, ఎంపీవో తిరుపతిరెడ్డి, కెనరా బ్యాంకు మేనేజర్ సంతోష్ గౌడ్, ఏపీవో రాజు ఇంటర్వ్యూలు నిర్వహించారు.

**భిక్కనూరు:** సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న మైనార్టీ అభ్యర్థులకు ఎంపీడీవో అనంత్‌రావు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలానికి ఐదు యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.

# పండరిపూర్ యాత్ర ప్రారంభం



డోలక్ వాయిస్తున్న స్పీకర్ పోచారం

**బాన్సువాడ టౌన్:** పండరిపూర్ దిండి పాదయాత్రను స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. పాత బాన్సువాడ హనుమాన్ మందిరం నుంచి భక్తులు పాదయాత్రగా పండరీపురం బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ బాన్సువాడ భక్తి వాడగా పేరొందుతోందన్నారు. ఏటా అయ్యప్ప స్వాములు, సరస్వతి దీక్ష స్వాములు, శివ స్వాములు, పండరీపూర్ వరకు బక్తులు పాదయాత్ర చేపట్టడం అభినందనీయం అన్నారు. ఆయన వెంట నాయకులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, విఠల్‌రెడ్డి, రాంరెడ్డి, గంగవ్వ, గొల్ల విఠల్, మంగలిరాజు, కృష్ణమురళి, చీకట్ల రాములు, నారాయణ, సహదేవ్ తదితరులు ఉన్నారు.

# సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యం



బీబీపేటలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్ చైర్మన్

**బీబీపేట:** కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని జెడ్పీ వైస్ చైర్మెన్ ప్రేమ్‌కుమార్ కోరారు. మంగళవారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కంటి వెలుగుతో కలిగే ప్రయోజనం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాలమణి, ఎంపీడీవో పూర్ణచంద్రోదయకుమార్, డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీవో కృష్ణ పాల్గొన్నారు.

**లింగంపేట:** సంపూర్ణ అంధత్వ నిర్మూలన సాధించే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మల్లికార్జున్‌రెడ్డి వెల్లడించారు. మండల కేంద్రంలో మంగళవారం వివిధ శాఖలకు చెందిన అధికారులకు ఆయన అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. లింగంపేట, మోతెలో 19న కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు లావణ్య, కార్యదర్శి రాజేందర్, ఉపసర్పంచ్ కొడ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

**మాచారెడ్డి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డీఎల్‌పీవో సాయిబాబా సూచించారు. వీటిపై ప్రచారం కల్పించేందుకు బుధవారం నుంచి గ్రామాల్లో టాం టాం వేయించాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీడీవో ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

**దోమకొండ:** కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్ పేర్కొన్నారు. వంద రోజుల పాటు కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీపీ కానుగంటి శారద, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ శాంత, ఎస్సై సుధాకర్, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, ఎంపీవో తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**బిచ్కుంద:** కంటి వెలుగు కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఆనంద్ పేర్కొన్నారు. పుల్కల్ పీహెచ్‌సీలో బుధవారం ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.

**తాడ్వాయి:** కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైస్ ఎంపీపీ నర్సిములు కోరారు. పలు ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేష్, ఎంపీడీవో రాజ్‌వీర్ తదితరులు పాల్గొన్నారు.

**నస్రుల్లాబాద్(బీర్కూర్):** బీర్కూర్ మండలంలో బుధవారం నుంచి కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ రఘు అన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాను ప్రసాద్, తహసీల్దార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

**నస్రుల్లాబాద్:** కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా అవసరమైన వారందరికీ కంటి పరీక్షలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సుబ్రమణ్యం సూచించారు. కార్యక్రమానికి సంబంధించి అధికారులకు అవగాహన కల్పించారు. గిర్దావార్ హన్మండ్లు, వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, ఎంపివో రాము పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి:** కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 వార్డులకు వైద్య బృందాన్ని కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, వైస్ చైర్మెన్ సుజాత, మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

### నిర్వహణ ఖర్చులు పెంచాలి





మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ సుధాకర్

**రాజంపేట:** కంటి వెలుగు కార్యక్రమం అమలు కోసం నిర్వహణ ఖర్చులు పెంచాలని స్థానిక ప్రజాప్రతినిధులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నిర్వహణ ఖర్చు కోసం రోజుకు రూ. వెయ్యి మాత్రమే కేటాయించడంపలువురు సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందికి భోజనాలతో పాటు ఇతరత్రా ఖర్చులకు ఆ మొత్తం సరిపోదని పేర్కొన్నారు. మండల ఎంపీడీవో బాలకిషన్ జోక్యం చేసుకుని రోజుకి రూ. 2500 ఇచ్చే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇవ్వడంతో ప్రజాప్రతినిధులు శాంతించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల స్వరూప, జెడ్పీటీసీ కొండహన్మండ్లు, ఎంపీవో రఘురాం, ఏపీఎం సాయిలు పాల్గొన్నారు.

## సంక్షిప్తం

**హెల్మెట్ తప్పనిసరి**

**నస్రుల్లాబాద్:** ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై రంజిత్ రెడ్డి సూచించారు. మండల కేంద్రంలో వాహనాలను తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**ఆర్థిక సహాయం**

**లింగంపేట:** మండలంలోని భవానిపేట గ్రామానికి చెందిన రసజ్ఞ ఇటీవల ఎంబీబీఎస్‌లో సీటు సాధించినా చదివేందుకు ఆర్థిక సమస్యలు ఉండటంతో లింగంపేటకు చెందిన న్యాయవాది మోహిన్ హమ్మద్ ఖాద్రీ విద్యార్థినికి రూ.20 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. ఆ మొత్తాన్ని ఎంపీడీవో అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు లావణ్య, ఏపీఎం శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**సర్పంచ్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే**

**మద్నూర్:** రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ డోంగ్లీ మండలం లింబూర్ సర్పంచ్ మదుకర్ పటేల్‌ను ఎమ్మెల్యే హన్మంత్‌సింధే మంగళవారం పరామర్శించారు. అనంతరం లింబుర్‌కి చెందిన మాజీ ఎంపీపీ బీంరావ్ పటేల్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

**బడి బయట పిల్లల గుర్తింపు**

**ఎల్లారెడ్డిరూరల్:** మండలంలోని తిమ్మారెడ్డి తండాలో నిర్వహించిన బడి బయట పిల్లల సర్వేలో ఒకరిని గుర్తించినట్లు సీఆర్‌పీ మహిపాల్ తెలిపారు. 14 ఏళ్ల బాలిక మాలావత్ నీల చదువు మానేసి ఇంటి వద్దనే ఉండడంతో బాలిక తల్లితండ్రులకు అవగాహన కల్పించి బాలికను పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు.

**మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి**

**నస్రుల్లాబాద్:** మండలంలోని మైలారం గ్రామం కొచ్చరి మైసమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా మంగళవారం ముక్కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

**బిల్లులు సకాలంలో చెల్లించాలి**

**నస్రుల్లాబాద్:** విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలని ట్రాన్స్‌కో ఏఈ అరవింద్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద రోజూ సిబ్బంది అందుబాటులో ఉండి బిల్లులు వసూలు చేయనున్నట్లు తెలిపారు.

**గ్రంథాలయాన్ని తనిఖీ చేసిన డీఈవో**



**రామారెడ్డి:** మండలంలోని పోసానిపేటలో స్థానికులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని డీఈవో రాజు, ఎంఈవో యోసేఫ్ మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలో కల్పించిన వసతుల గురించి సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ సుతారి నరేష్‌ను అడిగి తెలుసుకున్నారు. యువత, విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.